సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 24 । డిసెంబర్ । 2024



అర్జీలు పునరావృతం కారాదు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు పునరావృతం కారాదని కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశించారు. 8లో



నావికాదళ విన్యాసాలకు ఏర్పాట్లు

బీచ్‌రోడ్డులో జనవరి 4వ తేదీన నిర్వహించే నావికాదళ విన్యాసాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. 8లో



జీవీఎంసీకి అవార్డుపై హర్షం

జీవీఎంసీకి జాతీయ స్థాయిలో అవార్డు రావడంపై మేయర్ గొలగాని హరివెంకట కుమారి హర్షం వ్యక్తం చేశారు. 8లో

న్యూస్‌రీల్

ఎంపీ విజయసాయిరెడ్డికి ఘన స్వాగతం



విజయసాయిరెడ్డికి స్వాగతం పలికిన పార్టీ నేతలు

సాక్షి, విశాఖపట్నం : వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి విశాఖ ఎయిర్‌పోర్టులో సోమవారం ఘన స్వాగతం లభించింది. వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, పార్టీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, ముఖ్యనేతలు కొండా రాజీవ్‌గాంధీ, దేవన్‌రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. విద్యుత్ చార్జీల బాదుడుపై ఈ నెల 27న పార్టీ తలపెట్టిన 'వైఎస్సార్ సీపీ పోరుబాట' పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించనున్నారు.

జీవీఎంసీ బడ్జెట్‌కు స్థాయీ సంఘం ఆమోదం



దాబాగార్డెన్స్: జీవీఎంసీ 2025–26 ఏడాదికి సంబంధించి వార్షిక బడ్జెట్‌ను జీవీఎంసీ స్థాయీ సంఘం ఆమోదం తెలిపిందని మేయర్, స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. సోమవారం స్థాయీ సంఘ సమావేశ మందిరంలో 2025–26 వార్షిక బడ్జెట్‌పై సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవీఎంసీ 2025–26 వార్షిక బడ్జెట్ ప్రారంభ నిల్వ రూ.476.44 కోట్లు, అన్ని పద్దుల కింద జమలు రూ.4,232.71 కోట్లు, ప్రారంభ నిల్వతో కలిపి మొత్తం జమలు రూ.4,709.15 కోట్లు, అన్ని పద్దుల కింద ఖర్చులు రూ.4,554.27 కోట్లు, ముగింపు నిల్వగా రూ.154.88 కోట్లుగా తెలిపారు. సభ్యులు బడ్జెట్‌పై చర్చించిన అనంతరం స్వల్ప మార్పులతో సవరణలపై చర్చించి బడ్జెట్‌ను ఆమోదించినట్టు తెలిపారు. త్వరలోనే కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ఆమోదానికి రానుందన్నారు.

వారాంతంలో అరకు స్పెషల్స్



తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా శని, ఆదివారాల్లో విశాఖపట్నం–అరకు మధ్య స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం–అరకు–విశాఖపట్నం (08525/08526) స్పెషల్ రైళ్లు ప్రతీ శని, ఆదివారాల్లో విశాఖపట్నంలో ఉదయం 8.30 గంటలకు బయల్దేరి అదే రోజు ఉదయం 11.45 గంటలకు అరకు చేరుకుంటాయి. తిరుగు ప్రయాణంలో అరకులో ప్రతీ శని, ఆదివారాల్లో మధ్యాహ్నం 2 గంటలకు బయల్దేరి సాయంత్రం 6 గంటలకు విశాఖపట్నం చేరుకుంటాయి. ఈ స్పెషల్ రైళ్లు ఈ నెల 28వ తేదీ నుంచి జనవరి 19వ తేదీ వరకు నడుస్తాయి.

కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.78.78 లక్షలు



దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మీ ఆలయంలో గత నెల 13 నుంచి ఈ నెల 23 వరకు హుండీల ద్వారా వచ్చిన నగదు, బంగారం, వెండి తదితర కానుకలను సోమవారం లెక్కించారు. ఇందులో రూ.78 లక్షల 78 వేల 841 నగదుతో పాటు 59.100 గ్రాముల బంగారం, 690 గ్రాముల వెండి వచ్చింది. వీటితోపాటు 143 యూఎస్ డాలర్లు, 10 ఆస్ట్రేలియా డాలర్లు, 20 కెనడియన్ డాలర్లు, బ్యాంక్ ఆఫ్ మలేషియాకు చెందిన 5 ఆర్‌ఎమ్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కి చెందిన 5 దిర్హామ్‌లు వచ్చాయి.

93 మంది కానిస్టేబుళ్లకు స్థానచలనం

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీ సంఖ్యలో పోలీస్ కానిస్టేబుళ్ల బదిలీలు జరిగాయి. ఈ మేరకు సీపీ డాక్టర్ శంఖబ్రతబాగ్చి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయిదేళ్లకు పైగా ఒకే చోట విధులు నిర్వర్తిస్తున్న వారికి స్థానచలనం కలిగించారు.

రేపు పారిశుధ్య కార్మికులకు సెలవు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు బుధవారం క్రిస్మస్ పండగ సందర్భంగా సెలవు ప్రకటించారు. ప్రజలు వ్యర్థాలను ఇంటి వద్దే సురక్షితంగా నిల్వ చేసి మరుసటి రోజు పారిశుధ్య కార్మికులకు అందజేయాలని ప్రధాన వైద్యాధికారి నరేష్ విజ్ఞప్తి చేశారు.



అక్కిరెడ్డిపాలెం పంచవటి గోడ పక్కగా వెలగని వీధి లైట్లు

మహా విశాఖ నగరంలో కారుచీకట్లు అలముకుంటున్నాయి. వీధి దీపాలు వెలగకపోవడంతో చీకటి పడితే అంధకారమే రాజ్యమేలుతోంది. ఆయా కాలనీల్లో ఏ వీధిలో చూసినా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. రోజుల తరబడి వీధి దీపాలు వెలగకపోయినా అధికారులు కన్నెత్తి చూడటం లేదు. ప్రజలు పదే పదే ఫిర్యాదుల చేస్తే వేరే వీధిలోని దీపాలను తీసుకొచ్చి అమర్చుతున్నారు తప్ప, శాశ్వత పరిష్కారం చూపడం లేదు.

కూటమి కార్పొరేటర్ల కమీషన్ల కక్కుర్తి

కమ్ముకున్న కారుచీకట్లు



పట్టాభిరెడ్డితోట ప్రాంతంలో వెలగని లైట్లు

జోన్	వీధి దీపాల సంఖ్య
జోన్–1	5,190
జోన్–2	17,919
జోన్–3	11,120
జోన్–4	9,567
జోన్–5	20,818
జోన్–6	24,763
జోన్–7	8,654
జోన్–8	19,969
మొత్తం	1,18,000



తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్ కోదండ రామాలయం ఎదురుగా..

నగరంలో వీధిదీపాలు 1.18 లక్షలు

వెలుగుతున్నవి 80 వేలు

వెలగనివి 38 వేలు

ఏటా కాంట్రాక్టర్‌కు చెల్లిస్తోంది రూ. 13.56 కోట్లు

వీధి దీపాల నిర్వహణ.. కూటమి కార్పొరేటర్లకు కాసులు కురిపిస్తోంది. అదేంటి అనుకుంటున్నారా.. సదరు కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించాలంటే వీరే ఎన్‌వోసీ ఇవ్వాలని కూటమి ప్రభుత్వం షరతు విధించింది. దీంతో వీధిదీపాల నిర్వహణ కాంట్రాక్టర్ వీరిని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. 'వార్డులో వీధి దీపాలన్నీ సక్రమంగా వెలుగుతున్నాయి. సమస్య ఎదురైనా.. వెంటనే పరిష్కరిస్తున్నారు. సేవల పట్ల సంతృప్తిగానే ఉన్నామని' ఒక లేఖ ఇవ్వండి అంటూ కూటమి కార్పొరేటర్లను కలిసి విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే అదునుగా వీరు వసూళ్లకు తెరతీశారు. సంతకం పెట్టాలంటే రూ.లక్ష చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

- సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం



అంధకారంలో రుషికొండ రోడ్డు

జీవీఎంసీ పరిధిలో మొత్తం 1.18 లక్షల వీధిదీపాలున్నాయి. ఏడేళ్ల పాటు వీటి నిర్వహణ బాధ్యతను బ్రిడ్జ్ అండ్ రూఫ్ అనే ప్రైవేటు ఏజెన్సీకి జీవీఎంసీ 2023లో అప్పగించింది. ఇందుకు ఏటా రూ.13.56 కోట్లు చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. సదరు ఏజెన్సీ సబ్ కాంట్రాక్టు ఇవ్వడంతో నిర్వహణ సరిగా లేదన్న విమర్శల నేపథ్యంలో గత ప్రభుత్వ హయాంలో రెండు సార్లు నోటీసులు జారీచేశారు. మూడోసారి కూడా నోటీసులు జారీచేసి కాంట్రాక్టును రద్దు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈలోగా ఎన్నికలు జరిగి కూటమి ప్రభుత్వం వచ్చింది. ఇప్పుడు వీధి దీపాలు వెలుగుతున్నాయంటూ కవరింగ్ చేసి.. మామూళ్లు దండుకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు కార్పొరేటర్ల నుంచి దీపాలు వెలుగుతున్నట్లు సంతకాలు తేవాలంటూ కొత్త విధానాన్ని తెరమీదకు తెచ్చారు. సంతకం పేరుతో సదరు కాంట్రాక్టు సంస్థ నుంచి భారీగా మామూళ్లు దండుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎక్కువగా గాజువాక, పెందుర్తి ప్రాంతాలకు చెందిన కూటమి కార్పొరేటర్లే మామూళ్లకు తెగబడుతున్నారు.



భీమిలిలోని బ్యాంక్ రోడ్డులో వెలగని లైట్

కాంట్రాక్టరుతో కుమ్మక్కు..!


వీధి దీపాలు వెలగడం లేదన్న విమర్శల నేపథ్యంలో గత ప్రభుత్వ హయాంలో అప్పటి జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సదరు కాంట్రాక్టరుకు రెండు సార్లు నోటీసులను జారీచేశారు. మూడోసారి కూడా నోటీసు జారీచేసి కాంట్రాక్టును రద్దు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్‌కు ఆదేశాలు కూడా జారీచేశారు. అయితే ఎన్నికలు.. అనంతరం బదిలీతో ఈ ప్రక్రియ కాస్తా నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా జీవీఎంసీ సర్వసభ్య సమావేశంలో వీధి దీపాల వ్యవహారంపై కార్పొరేటర్ల నుంచి విమ్మలొచ్చాయి. దీనిపై లోతుగా అధ్యయనం చేసి.. సదరు కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశం జరిగి మూడు నెలలు దాటినప్పటికీ ఆ దిశగా కనీస చర్యలు లేవు. పైగా మూడో నోటీసు ఇవ్వకుండా కూటమి ప్రభుత్వంలోని కీలక కార్పొరేటర్లు చక్రం తిప్పుతున్నట్టు తెలుస్తోంది. సదరు కాంట్రాక్ట్‌ను రద్దు చేయకుండా ఉండేందుకుగాను భారీ మామూళ్లకు మాట్లాడినట్లు సమాచారం.



జోన్–5 పరిధి ఇందిరానగర్‌లో..

కూటమి కార్పొరేటర్ల నయా దందా..!

వార్డుల్లో వీధి దీపాలు సక్రమంగా వెలుగుతున్నట్లు స్థానిక కార్పొరేటర్ నుంచి అంగీకార పత్రం ఉండాలంటూ తాజాగా అధికారులు మెలిక పెట్టారు. ఇదే అదనుగా సదరు కాంట్రాక్టర్ నుంచి వసూళ్లకు తెరలేపారు. తమ వార్డులో వీధి దీపాలు బాగున్నాయని సంతకం పెట్టాలంటే రూ.లక్ష చొప్పున ఇచ్చుకోవాల్సిందేనని షరతు విధించినట్టు తెలుస్తోంది. అసలు వీధి దీపాలు వెలుగుతున్నాయా? లేదా? అంశాన్ని కంట్రోల్ రూం నుంచి నేరుగా పరిశీలించే వీలుంది. అయినప్పటికీ కూటమి కార్పొరేటర్లకు మామూళ్లు వచ్చేలా చేసేందుకే ఈ కొత్త విధానాన్ని తెరమీదకు తెచ్చారన్న విమర్శలున్నాయి.



ఒకటో వార్డు సంతపేట కుమ్మరివీధిలో..

ఇక్కడిది పోతే అక్కడిది తీసుకొచ్చి..

జీవీఎంసీ పరిధిలో 80 వేల వరకు వీధి దీపాలు వెలుగుతుండగా.. 38 వేల వీధి దీపాలు వెలుగులు విరజిమ్మడం లేదు. అయితే అన్ని వీధి దీపాలు వెలుగుతున్నట్టుగా ఎప్పటికప్పుడు నివేదికలు మాత్రం అధికారులకు చేరుతుండటం గమనార్హం. మరోవైపు తమ వీధిలో వీధి దీపాలు వెలగడం లేదని ఫిర్యాదులు వస్తే సిబ్బంది వేరే ప్రాంతంలోని వీధి దీపాలను తీసుకొచ్చి అక్కడ అమరుస్తున్నారు. కొత్త దీపాలను కొనుగోలు చేయకుండా షటిల్ సర్వీసుతో కాంట్రాక్టు సంస్థ గేమ్‌లు ఆడుతోందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

నేరాలకు అడ్డాగా.. చీకటి ప్రాంతాలు

నగరంలో వీధి దీపాల నిర్వహణకు 400 మంది సిబ్బందిని నియమించి, పర్యవేక్షించేందుకు కాంట్రాక్టర్ అంగీకరించారు. కానీ కేవలం 150 మందితోనే పని నడిపించేస్తుండడంతో రోజూ సుమారు 38 వేలకు పైగా వీధిదీపాలు వెలగడం లేదు. చీకటి పడితే చాలా ప్రాంతాలు అంధకారంలో మగ్గిపోతున్నాయి. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. చైన్ స్నాచింగ్‌లు, ఈవ్ టీజింగ్, గంజాయి, డ్రగ్స్ వినియోగం జరిగిపోతున్నాయి. కొండవాలు ప్రాంతాల్లో కారు చీకట్లు కమ్మేయడంతో పార్కింగ్‌లో నిలిపి ఉంచిన ఆటోలు, ఇతర వాహనాల బ్యాటరీలు చోరీకి గురవుతున్నాయి. గంజాయి బ్యాచ్‌లు చీకటి రోడ్లపై తిష్టవేసి దారి దోపిడీలకు పాల్పడుతున్నారు. యువతులు, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు.



హైవేలో కొమ్మాది జంక్షన్ వద్ద సెంట్రల్ లైటింగ్ ఇలా..



76వ వార్డు నడుపూరు వంతెన వద్ద



64వ వార్డు గొడ్డువానిపాలెం, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ రోడ్డులో..



జీవీఎంసీ 11వ వార్డు అంబేడ్కర్‌నగర్‌లో వెలగని విద్యుత్ దీపాలు

పేదల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

దిశ కమిటీ సమీక్షలో ఎంపీ శ్రీభరత్



మాట్లాడుతున్న ఎంపీ శ్రీ భరత్. చిత్రంలో దినకర్, కలెక్టర్ హరేందిర ప్రసాద్, ఎమ్మెల్యేలు

మహారాణిపేట: సామాన్యులు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా ప్రోత్సహించాలని ఎంపీ శ్రీభరత్ అన్నారు. కేంద్ర పథకాలు అర్హులకు అందేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రాయోజిత పథకాల తీరు తెన్నులు, సమస్యలు, ఎదురవుతున్న సవాళ్లు, అధికారుల సమన్వయం తదితర అంశాలపై కలెక్టరేట్ మీటింగ్ హాలులో సోమవారం జరిగిన దిశ (డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ కో–ఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ/జిల్లాస్థాయి అభివృద్ధి సమన్వయ మానటరింగ్ కమిటీ) సమావేశంలో 20 సూత్రాల కార్యక్రమ అమలు చైర్మన్ లంకా దినకర్‌తో కలిసి ఆయన వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ క్రమంలో 31 విభాగాల పరిధిలో కేంద్రం అమలు చేస్తున్న అభివృద్ధి పనులు, కేంద్ర పథకాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అమలుపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, అధిక పని దినాలు కల్పించి, పూర్తి వేతనాలు అందించాలన్నారు. అర్హులకు సామాజిక పింఛన్లు అందించాలని, అనర్హుల గుర్తింపులో శాస్త్రీయ విధానాలను అవలంబించాలని సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అనర్హుల పింఛన్లు గుర్తించే క్రమంలో అధికారులు జాగ్రత్త వహించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అర్హులకు అన్యాయం జరగకుండా చూసుకోవాలని ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గణబాబు, విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు. సామాజిక పింఛన్ల అంశంపై జరిగిన సమీక్షలో భాగంగా వారందరూ ఈ మేరకు వారి అభిప్రాయాలను వెల్లడించారు. వైద్యారోగ్య శాఖ ద్వారా అందే పింఛన్లు పొందేందుకు కొంతమంది తప్పుడు పత్రాలు సృష్టించారని అలాంటి వారిని గుర్తించి నివేదించాలని సూచించారు. ఒంటరి మహిళల విషయంలో కాస్తంత సడలింపులు ఇస్తూ పింఛన్లు అందజేయాలని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మరుగుజ్జులకు, క్యాన్సర్ బాధితులకు పింఛన్లు అందించేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపించాలని ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సూచించారు. సమావేశంలో ఆయిల్ – సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి, సీపీవో శ్రీనివాసరావు, డ్వామా పీడీ పూర్ణిమ, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్మాణాల్లో ఆర్కిటెక్ట్‌ల భాగస్వామ్యం

డీటీసీపీకి ఐఐఏ విజ్ఞప్తి



డీటీసీపీ అదనపు డైరెక్టర్ శ్రీనివాసులకు వినతి పత్రం అందిస్తున్న ఐఐఏ ప్రతినిధుల బృందం

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో చేపడుతున్న ప్రభుత్వపరమైన భవన నిర్మాణాల్లో ఆర్కిటెక్ట్‌లను భాగస్వాములుగా చేయాలని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్(ఐఐఏ) విశాఖపట్నం సెంటర్ చైర్మన్ రాజేష్ నాగుల విజ్ఞప్తి చేశారు. అమరావతిలోని డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్(డీటీసీపీ) అదనపు డైరెక్టర్ బి.శ్రీనివాసుల్ని ఏపీ ఆర్కిటెక్ట్‌ల బృందం సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. భవన నిర్మాణాలపై త్వరలో రానున్న ప్రభుత్వ ఉత్తర్వుల ముసాయిదాకు సంబంధించి కొన్ని ముఖ్యమైన సూచనలు, అభ్యర్థనలను సమర్పించారు. రాష్ట్రంలో సమాంతర అభివృద్ధి కోసం ఆర్కిటెక్ట్‌ల పాత్రను తప్పనిసరి చేయాలంటే గ్రూప్ హౌసింగ్, పారిశ్రామిక సముదాయాలు, హాస్పిటల్స్, పర్యాటక అభివృద్ధి వంటి నిర్మాణాల అనుమతుల ప్రక్రియలో ఆర్కిటెక్ట్‌లను భాగస్తులను చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. 500 చ.మీటర్లు పైబడిన ప్రాజెక్ట్‌ల నిర్మాణానికి, వాటి భద్రత, నాణ్యత, డిజైన్ సమగ్రతల దృష్ట్యా ఆర్కిటెక్ట్‌ల ప్రమేయం తప్పనిసరి చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డీటీసీపీ.. ఆర్కిటెక్ట్‌ల సూచనలు, సలహాల్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఏకీకృత రిజిస్ట్రేషన్ విధానంతో కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్(సీవోఏ) రిజిస్ట్రేషన్ స్టేటస్‌తో అనుసంధానించిన ఎలాంటి ఇబ్బందుల్లేని లాగిన్ వ్యవస్థను రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు రాజేష్ తెలిపారు.


బ్యాంకుకే టోకరా!

- గోల్డ్ రుణం బదలాయింపు పేరిట మోసం
- రూ.14.69 లక్షలు విత్‌డ్రా చేసుకుని పరారీ

సీతమ్మధార: ఓ ఘరానా మోసగాడు బ్యాంకుకే టోకరా వేశాడు. బ్యాంక్ లోన్ లేకుండానే ఉన్నట్లు నమ్మించి మరో బ్యాంక్ నుంచి డబ్బులు కాజేసిన ఘటన ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. అల్లిపురం ప్రాంతానికి చెందిన తమరాన చిరంజీవి(40), మరో వ్యక్తితో కలిసి సోమవారం సీతంపేట ప్రాంతంలో ఉన్న సీఎస్‌బీ బ్రాంచ్‌కు వెళ్లాడు. తనకు సుజాతనగర్‌లో ఉన్న ఫెడరల్ బ్యాంక్‌లో బంగారు ఆభరణాలు తాకట్టులో ఉన్నాయని, వాటిని రిలీజ్ చేస్తే ఆ బంగారాన్ని సీఎస్‌బీ బ్యాంక్‌లో తాకట్టు పెడతానని సిబ్బందికి చెప్పాడు. దీంతో సీఎస్‌బీ సిబ్బంది చిరంజీవికి సంబంధించిన ఫెడరల్ బ్యాంక్ అకౌంట్‌కు రూ.14.69 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశారు. దీంతో చిరంజీవి ఫెడరల్ బ్యాంక్‌కు వెళ్లి ఆ డబ్బు విత్‌డ్రా చేసుకుని వెళ్లిపోయాడు. ఆ తర్వాత తాము మోసపోయినట్లు సీఎస్‌బీ సిబ్బంది ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల ఫొటోలను రిలీజ్ చేశారు. ఆచూకీ తెలిస్తే ద్వారకా సీఐ 7995093604, ఎస్‌ఐ ధర్మేంద్ర 8555813894 నెంబర్లకు తెలియజేయాలని కోరారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకువెళ్లండి

- దేవుడు అండగా ఉంటాడు
- క్రిస్మస్ వేడుకల్లో కలెక్టర్ హరేందిర ప్రసాద్



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

బీచ్‌రోడ్డు : ఆత్మవిశ్వాసంతో ముందుకువెళితే వారి వెంట దేవుడు అండగా ఉంటాడని..బైబిల్ కూడా అదే బోధిస్తోందని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ ఎరినాలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరేందిర ప్రసాద్ క్యాండిల్ వెలిగించి, కేక్ కట్ చేసి ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచమంతా చేసుకునే ఏకైక పండగ క్రిస్మస్ అన్నారు. అణగారిన వర్గాలకు చెందిన ప్రజలను మేల్కొలిపి వారిలో ఏసు ప్రభువు చైతన్యం కల్పించారని తెలిపారు. ముందుగా ప్రార్థనా కార్యక్రమాన్ని పాస్టర్ డానియల్ శ్యామ్, పాస్టర్ – సంజీవ కుమారి నిర్వహించారు. సెయింట్ లూక్స్ నర్సింగ్ కాలేజ్, సెయింట్ లూక్స్ మైనారిటీ ఎడ్యుకేషనల్ సొసైటీ, విద్యార్థినులు ఏసు ప్రభువు ప్రార్థనా గీతాలను ఆలపించారు. రేవ రాబర్ట్ స్మిత్ పాస్టర్ తమ సందేశాన్ని అందించారు. ఎంపీ ఎం.శ్రీభరత్, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, టీడీపీ నేతలు గండి బాబ్జీ, సీతంరాజు సుధాకర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అలా సాగరతీరంలో..



నగరాన్ని నీలిమబ్బులు కమ్మేశాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాస్త విరామం ఇచ్చాయి. ఆదివారం కనిపించిన భానుడు ఒక్కరోజులోనే మళ్లీ మొహం చాటేశాడు. సోమవారం ఉదయం నుంచి భానుడి జాడే లేదు. నగరం చుట్టూ దట్టమైన మబ్బులు కమ్మేశాయి. వాతావరణం కాస్త ఆహ్లాదకరంగా ఉండటంతో నగర వాసులు సాగర తీరంలో సందడి చేశారు. ఆర్.కె బీచ్ నుంచి రుషికొండ తీరం వరకు సాగర తీరమంతా ప్రజలతో, పర్యాటకులతో సందడిగా మారింది. తెన్నేటి పార్క్ వెనుక భాగంలో సినిమా షూటింగ్ సైతం జరిగింది. సముద్ర తీరంలోకి వాహనాలతో వచ్చిన కొందరు వాటిని తిరిగి బయటకు తీసుకువెళ్లడానికి నానా తంటాలు పడ్డారు.

- ఏయూక్యాంపస్, ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖ





క్రిస్మస్ జోష్

నగరంలో క్రిస్మస్ జోష్ కనిపిస్తోంది. ఏ మూలన చూసిన శాంతా క్లాజ్ వేషధారణలతో చిన్నారులు సందడి చేస్తున్నారు. షాపింగ్ మాల్స్, హోటల్స్‌లో ఇప్పటికే క్రిస్మస్‌ను ప్రతిబింబించే విధంగా అలంకరణలు చేశారు. మరో వైపు పాఠశాలల్లో క్రిస్మస్ వేడుకలను జరుపుకుంటున్నారు. సోమవారం ఎంవీపీ కాలనీలోని ఒక పాఠశాలలో చిన్నారులు క్రిస్మస్ వేడుకల్లో భాగంగా శాంతాక్లాజ్ దుస్తులు ధరించి సందడి చేశారు. చిన్నారులు ఆట పాటలతో అలరించారు. కేక్ కట్ చేశారు.

-ఏయూక్యాంపస్, ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖ





నావికాదళ విన్యాసాలకు ఏర్పాట్లు



బీచ్‌రోడ్డులో జనవరి 4వ తేదీన నిర్వహించే నావికాదళ విన్యాసాలకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం విశ్వప్రియ కన్వెన్షన్ హాల్ ఎదురుగా వేదిక నిర్మాణం జరుగుతోంది. అదే విధంగా బీచ్‌రోడ్డులో బారికేడ్లు నిర్మిస్తున్నారు. అదే విధంగా నావికాదళ నౌకలు విశాఖ తీరానికి చేరుకుంటున్నాయి.

-ఏయూక్యాంపస్, ఫొటోలు :సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

వ్యక్తి మృతికి కారణమైన నిందితుడికి ఐదేళ్ల జైలు

విశాఖ లీగల్: ఒక వ్యక్తి మృతికి కారణమైన నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 2 వేలు జరిమానా విధిస్తూ నగరంలోని ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం. వెంకటరమణ సోమవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. అదనపు డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పీజీఎస్ఎన్ ప్రసాద్ రావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు ఉమ్మడి విశాఖ జిల్లా పెద బయలు పోలీస్ స్టేషన్ పరిధిలోని గంపదర సత్తిబాబు (42) పెదకోడే పల్లి గ్రామంలో ఉంటున్నాడు. పంట పొలాలకు జంతువులు, పందులు రాకుండా విద్యుత్ కంచె ఏర్పాటు చేసుకున్నాడు. ప్రభుత్వం లేదా విద్యుత్ శాఖ అనుమతి లేకుండా ఆ పొలానికి రాత్రిపూట విద్యుత్ కంచెలను అమర్చాడు. ఈ నేపథ్యంలో 2014 సెప్టెంబర్ 5వ తేదీ ఉదయం మజ్జి బాలరాజు తన గ్రామ సమీపంలోని సంతకు బయలుదేరాడు. విద్యుత్ కంచి ఉన్న ప్రాంతం నుంచి సంతకు వెళుతూ ఉండగా విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య నూకాలమ్మ ఫిర్యాదు మేరకు పెదబయలు పోలీసులు కేసు నమోదు చేశారు. భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 235, రాష్ట్ర విద్యుత్ నియంత్రణ చట్టం 2003 కింద పెదబయలు పోలీసులు కేసు దర్యాప్తు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పునిచ్చారు. కేసులో 9 మంది నిందితుల కాగా కేవలం రెండో నిందితుడు సత్తిబాబుకు జైలు శిక్ష విధించారు.

అర్జీల పునరావృతంపై కలెక్టర్ అసంతృప్తి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను 24 గంటలలోపు ఓపెన్ చేసి, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, 10 రోజుల్లో పునరావృతం కాని విధంగా సంతృప్తి కరమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, ఆర్డీవో శ్రీలేఖ, జీవీఎంసీ సిటీ ప్లానర్ ధనుంజయ రెడ్డి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాస్థాయి అధికారులు అర్జీదారులతో మాట్లాడి, సమస్య పూర్వాపరాలు తెలుసుకొని సరైన పరిష్కారం చూపాలన్నారు. అంతకుముందు అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో అధికంగా రీ-ఓపెన్ అర్జీలు రావడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అర్జీ పునరావృతం అయ్యిందంటే జిల్లా అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. శాఖల వారీగా పెండింగ్ వినతులు, పునరావృతం అయిన అర్జీలు, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 335 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు 181, పోలీసు శాఖకు 16, జీవీఎంసీకి సంబంధించి 64 ఉన్నాయి. అలాగే ఇతర విభాగాలకు సంబంధించి 74 వినతులు వచ్చాయి.

జీవీఎంసీ 'పీజీఆర్‌ఎస్'కు 114 వినతులు



వినతులు స్వీకరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, అదనపు కమిషనర్ రమణమూర్తి

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు (పీజీఆర్‌ఎస్) 114 వినతులు వచ్చాయని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. ప్రధాన కార్యాలయం పాత సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పరిష్కార వేదిక కార్యక్రమంలో అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తితో కలిసి మేయర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 114 వినతలు అందగా వీటిలో జోన్-1 నుంచి 2, జోన్-2 నుంచి 17, జోన్-3 నుంచి 22, జోన్-4 నుంచి 14, జోన్-5 నుంచి 16, జోన్-6 నుంచి 14, జోన్-8 నుంచి 10 వినతులు అందగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సంబంధించి 19 ఫిర్యాదుల అందినట్టు చెప్పారు. వచ్చిన ఫిర్యాదుల్లో జీవీఎంసీ అడ్మినిస్ట్రేషన్ అండ్ అకౌంట్స్ విభాగానికి ఒకటి, రెవెన్యూ విభాగానికి 14, ప్రజారోగ్య విభాగానికి 9, అత్యధికంగా పట్టణ ప్రణాళికా విభాగానికి 51, ఇంజినీరింగ్ విభాగానికి 26, హార్టీకల్చర్ విభాగానికి 7 ఫిర్యాదుల అందగా యూసీడీ విభాగానికి 6 ఫిర్యాదుల అందాయి. కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవరెడ్డి, డీసీఆర్ ఎస్.శ్రీనివాస్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

లేఅవుట్లలో సదుపాయాలు కల్పించకపోతే చర్యలు

- అటువంటి రియల్ ఎస్టేట్ సంస్థలకు నోటీసులు ఇవ్వాలి
- అధికారులను ఆదేశించిన వీఎంఆర్‌డీఏ ఛైర్మన్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్

విశాఖ సిటీ: లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పించని రియల్ ఎస్టేట్ సంస్థలకు వెంటనే నోటీసులు జారీ చేయాలని వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం వీఎంఆర్‌డీఏలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి 13 ఫిర్యాదులు వచ్చాయి. తాము కొనుగోలు చేసిన లేఅవుట్లలో సదుపాయాలు కల్పించలేదని, అనుమతులు లేని నిర్మాణాలు చేపడుతున్నారని కొంత మంది బాధితులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన వెంటనే సదరు రియల్ ఎస్టేట్ సంస్థలకు నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. వీఎంఆర్‌డీఏకి చెందిన స్థలాల్లో ఆక్రమణలు ఉంటే తొలగించాలని ఆదేశించారు. వీఎంఆర్‌డీఏకు సంబంధించిన అనుమతుల జారీ విషయంలో అధికారులు అవినీతి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా దర్బార్‌లో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్, చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్ప, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

విశాఖ సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు 99 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటిపై వెంటనే సంబంధిత స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి ఫిర్యాదుల విషయంలో అలసత్వం లేకుండా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

ప్రధాని సహకారంతో విశాఖ అభివృద్ధి



మాట్లాడుతున్న లంకా దినకర్

ఎంవీపీకాలనీ: దేశ ప్రధాని నరేంద్రమోది సహకారంతో విశాఖ ఆర్థిక రాజధానిగా, ఉత్తరాంధ్ర గ్రోత్ ఇంజిన్‌గా ఎదుగుతోందని ఏపీ బీజేపీ అధికార ప్రతినిధి లంకా దినకర్ అన్నారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా సోమవారం లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డబుల్ ఇంజిన్ సర్కార్ దిశగా ముందుకు సాగుతోందన్నారు. త్వరలో విశాఖ మెట్రో ప్రాజెక్టు తొలి దశ పనులు రూ.11,500కోట్లతో ప్రారంభం కానున్నాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉజ్బెకిస్తాన్‌లో ఆనందరావు మృతిపై విచారణ జరపాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసి బయటకు వచ్చిన ఆనందరావు కుటుంబ సభ్యులు

మహారాణిపేట: ఉజ్బెకిస్తాన్‌లో కె.ఆనందరావు అనుమానాస్పద మృతిపై విచారణ జరిపి న్యాయం చేయాలని వారి కుటుంబ సభ్యులు కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో ఆనందరావు భార్య సురేఖ, తల్లి అనురాధ మాట్లాడుతూ నవంబర్ 2న మరణిస్తే 3 తేదీ వరకు తమకు సమాచారం ఇవ్వలేదని, 8న మృతదేహాన్ని ఇండియాకు పంపించారని చెప్పారు. చనిపోవడానికి రెండు రోజుల ముందు తమకు పంపిన ఓ వీడియోలో జాబ్ అని చెప్పి, వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసినట్టు భార్య సురేఖ తెలిపారు. భారతీయులను నీచంగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. కంపెనీ వెట్టి చాకిరీని వ్యతిరేకించడమే ఆనందరావు మృతికి కారణమన్న అనుమానాలున్నాయన్నారు. అక్కడ జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి, తమ కుటుంబానికి న్యాయం చేయాలని వారు కోరారు. వారి వెంట వచ్చిన డాక్టర్ పల్లా కార్తీక్ ,విశాఖ పార్లమెంటరీ టీఎస్‌టీయూసీ అధికార ప్రతినిధి బలిరెడ్డి సత్యనారాయణ, జనసేన పార్టీ సీనియర్ నాయకుడు వెంకటరమణ, మృతుని పిల్లలు, బంధువులు ఉన్నారు.

చికిత్స పొందుతూ అంగన్‌వాడీ కార్యకర్త మృతి



రహీం మనీషా (ఫైల్)

సీతమ్మధార: జీవీఎంసీ పరిధి 43 వార్డు అక్కయ్యపాలెం, శ్రీనివాస నగర్‌కు చెందిన అంగన్‌వాడీ కార్యకర్త రహీం మనీషా బేగం చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. వివరాలు ఇలా... అక్కయ్యపాలెంలో శ్రీనివాసనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బేగం కార్యకర్తగా పనిచేస్తుంది. గోపాలపట్నానికి చెందిన సంగీత, రహీం మనీషా బేగం ఇద్దరూ డిగ్రీ నుంచి స్నేహితులు. ఇదిలావుండగా ఈ నెల 4న సంగీత, బేగంలు అక్కయ్యపాలెంలో కలుసుకున్నారు. ఓ ఆటోలో కూర్చుని చాలా సేపు మాట్లాడుకున్నారు. వీరిద్దరి మధ్య ఆర్థిక లావాదేవీలున్నాయి. దీంతో ఆటోలో ఇద్దరూ గొడవపడ్డారు. ముందుగానే తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను బేగంపై పోసి నిప్పటించి అక్కడి నుంచి సంగీత పరారైంది. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని 65శాతం కాలిపోయిన బేగంను చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ నుంచి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిందని ఫోర్త్‌టౌన్ పోలీసులు తెలిపారు.

సంక్రాంతి పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

డాబాగార్డెన్స్: సంక్రాంతి పండగ పురస్కరించుకొని ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని సమాజ సేవకులు, ఉపాధ్యాయులు, వైద్యులు, ఇంజినీర్లు, యోగ, మెడిటేషన్, సంగీత, నృత్య గురువులు, సినీ, టీవీ, రంగస్థల, కళాకారులు, కవులు, రచయితలు, క్రీడాకారులు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, మేధావులు, ఫొటో గ్రాఫర్లు, వాస్తు, జ్యోతిష్క, అర్చకుల ప్రతిభ, సేవలు గుర్తించి విశిష్ట ప్రతిభా పురస్కారాలు-2025 అందజేయనున్నట్టు సర్వేజనా సుఖినో భవంతు వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టారు పేర్కొన్నారు. జనవరి 12న హైదరాబాద్‌లో సంక్రాంతి ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నామన్నారు. ఆయా రంగాల్లో పొందిన సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్స్ జిరాక్స్‌లు, 4 పాస్ పోర్టు సైజు ఫొటోలు దరఖాస్తుకు జత చేసి ఈ నెల 31లోపు 'సర్వేజనా సుఖినో భవంతు, డోర్‌నంబరు 1-20-164, తిరుమలగిరి, గోకుల్‌నగర్, వెంకటాపురం, సికింద్రాబాద్-15 చిరునామాకు పంపాలన్నారు.

పలువురికి కలెక్టర్ సత్కారం



వ్యక్తిగత మరుగుదొడ్ల విభాగంలో పనిచేస్తున్న వారిని సత్కరిస్తున్న కలెక్టర్

మహారాణిపేట: ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ పలువురు సిబ్బందిని సత్కరించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వ్యక్తిగత మరుగుదొడ్ల విభాగంలో పనిచేస్తున్న చందక ధనలక్ష్మి (ఆనందపురం), బుసామంగ (వెల్లంకి), కొయ్య చిట్టితల్లి (చిప్పాడ), కాళ్ల సురేష్ (సింగనబంధ), రావాడ శ్రీను (పినగాడ)లను సన్మానించారు. అలాగే సామాజిక మరుగుదొడ్ల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధకనబరుస్తున్న పెదగాడి సర్పంచ్ కోసుబోయిన లావణ్య, సెక్రటరీ కె.లక్ష్మణరావు, వేములవలస సర్పంచ్ లంక కొండమ్మ, సెక్రటరీ ఎ.రామకృష్ణనాయుడులను కూడా కలెక్టర్ సత్కరించారు. జెడ్పీ సీఈవో పి.నారాయణ మూర్తి, డీపీవో శ్రీనివాసరావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఈ కేవీవీ చౌదరి పాల్గొన్నారు.

జీవీఎంసీకి జాతీయ అవార్డుపై మేయర్ హర్షం

డాబాగార్డెన్స్: పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా పీఆర్‌ఎస్ఐ-2024 ఉత్తమ ప్రజా అవగాహన కార్యక్రమంలో జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో జీవీఎంసీ నిలిచినందుకు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉత్తమ ప్రజా అవగాహనలో ప్రథమ స్థానంలో నిలిచినందుకు జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులను అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎకో వైజాగ్, స్వచ్ఛ సర్వేక్షన్, సీజనల్ వ్యాధుల నియంత్రణ, వ్యర్థాల విభజన, హోమ్ కంపోస్ట్, నీటి పొదుపు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తదితర అంశాలపై ప్రజలపై అవగాహన కల్పించడంలో జీవీఎంసీకి పీఆర్‌ఎస్ఐ జాతీయ అవార్డు లభించడంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, సీసీపీ ప్రభాకరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, పర్యవేక్షక ఇంజినీర్ గోవిందరావు, యూసీడీ ప్రాజెక్టు అధికారి డి.లక్ష్మీ, స్పోర్ట్స్ డైరెక్టర్ రాజు పాల్గొన్నారు.